25న రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు

ముషీరాబాద్: రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు వై.మల్లేష్, శంకర్, ఈశ్వర్, నర్సింగ్‌రావు బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు 19వ తేదీలోపు తమ నామినేషన్లు అందజేయాలని కోరారు. ఎన్నికలు జరిగే తేదీ 25న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం ఫలితాలను ప్రకటిస్తామన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పర్యావరణ పరిరక్షణకు తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తక్షణమే రాష్ట్రంలో పూర్తి స్థాయిలో నిషేధించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్(ఈపీడీ) తెలంగాణ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌సిహెచ్ రంగయ్య కోరారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో ప్రకృతి విధ్వంసం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1.5లక్షల కోట్లతో మూసీ నది ప్రక్షాళన, చెరువుల పరిరక్షణకు హైడ్రా లాంటి ప్రత్యేక చట్టంతో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి సింగిల్ యూజ్ అనర్థాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులే సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొత్త సంవత్సరంలోనైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బేషరతుగా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

క్రమశిక్షణతో పనిచేస్తే ఏ రంగంలోనైనా రాణించొచ్చు

చిక్కడపల్లి: క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేస్తే ఏ రంగంలోనైనా రాణించొచ్చని సినీదర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. చిక్కడపల్లిలో బుధవారం వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో నటభూషణ శోభన్‌బాబు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మధువీణ మ్యూజికల్స్ సమర్పణలో 'రాజువయ్య'శీర్షికతో కొనసాగిన సినీ సంగీత విభావరి అలరించింది. శోభన్‌బాబు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకున్నారని ఆయన అన్నారు. అధ్యక్షత వహించిన వంశీ రామరాజు మాట్లాడుతూ.. వంశీ సంస్థను శోభన్‌బాబు 50 సంవత్సరాల క్రితం ప్రారంభించారని గుర్తుచేశారు. శోభన్‌బాబు - వంశీ గ్లోబల్ పురస్కారాన్ని సినీనటుడు కౌశిక్‌కు ఆయన ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, బలాదిత్య, దైవజ్ఞశర్మ, వైఎస్ రామకృష్ణ, వెంకట్, వీణ, లలిత, అఖిల, అనిత, స్వరకల్యాణి, ఎస్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా బల్వీర్

కాచిగూడ: బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడిగా టి.బల్వీర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం బల్వీర్‌ను హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తూ జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, ఎం.నర్సింగ్‌రావు, శీర్‌సాగర్, సురేష్, బాల ప్రసాద్, చిట్టి శ్రీధర్, ఆర్.సంతోష్, అరవింద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి (40) ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాపూజీనగర్‌లో అగ్ని ప్రమాదం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీకాంత్, నిఖిల దంపతులు బాపూజీనగర్‌లో నివసిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పూజ సామగ్రిని కొనేందుకు భార్యాభర్తలు ఇద్దరు బయటకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఇంట్లో వస్తువులకు అంటుకున్నాయి. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు వెంటనే శ్రీకాంత్, పోలీసులకు సమాచారం అందించారు. ఇంటి తలుపులు తెరిచి మంటలను స్థానికులు నీళ్లు చల్లి అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లోని వాషింగ్ మెషిన్, కూలర్‌లు, ఫ్యాన్‌లు, టీవీ, ఫ్రిడ్జ్, దుస్తులు, నిత్యవసరాలు అన్ని దగ్ధమయ్యాయి. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హమ్మయ్య.. గుంతలు పూడ్చారు!

ఎట్టకేలకు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టిన జీహెచ్‌ఎంసీ అధికారులు



చిక్కడపల్లి, వివేక్‌నగర్, త్యాగరాయగానసభ ఎంఎస్‌రామారావు వీధి, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీపుల్స్ పార్క్, జవహర్‌నగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ సమస్య సాక్షి దినపత్రికలో 'ఇటు గుంతలు.. ఇటు కంకర తేలి..'అనే శీర్షికతో సోమవారం ప్రచురితం అయ్యింది. ఈ కథనానికి బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ యుద్ధప్రాతిపదికన కంకర తేలిన రోడ్లు, గుంతలకు మరమ్మతులు చేయించారు. రోడ్లను బాగు చేయడంతో 'సాక్షి'ఆయా కాలనీల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. – చిక్కడపల్లి


త్యాగరాయ గానసభ వెనుక రోడ్డులోని టీ కొట్టు వద్ద..


చిక్కడపల్లి గోవర్ధన్ కిరణా స్టోర్ రోడ్డులో...


చిక్కడపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా రోడ్డులో...

పండగ శోభ

సంక్రాంతి, కనుమను కుటుంబ సమేతంగా జరుపుకొన్న అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల ప్రజలు


సంక్రాంతిని పురస్కరించుకొని ప్రజలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, కనుమ రోజు రథం ముగ్గులు వేసి ఇళ్ల వాకిలిని అందంగా తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరి ఇంట్లో పండి వంటలైన సకినాలు, గారెలు, బూరెలు, అరెసలు, మురుకులు తయారు చేసుకున్నారు. పిల్లలు, మహిళలు, యువతులు ఇలా ఇంటిల్లి పాది పతంగ్‌లు ఎగరవేస్తూ సంతోషంగా కనిపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. ఒకరికొకరు కలసుకుని సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా లక్ష్మీగణపతి దేవాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

– చిక్కడపల్లి/ముషీరాబాద్ జోన్ బృందం


కళాధర్‌నగర్‌లో ముగ్గుల పోటీల్లో వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్


సుందరయ్య పార్కులో పతంగులను ఎగురవేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు


ఎమ్మెల్యే గోపాల్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేశ్వర్లు, పూస గోరక్‌నాథ్


కోదండ సీతారామచంద్రస్వామి




ఇళ్లు ముందు వేసిన అందమైన హరివిల్లు ముగ్గు, పుష్పం చుక్కల ముగ్గు


వల్లిదేవసేన సుబ్రమణ్యస్వామి


వీరాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు






ముషీరాబాద్, రాంనగర్, భరత్‌నగర్, బాకారం, ముషీరాబాద్‌లలో పతంగులు ఎగరవేస్తున్న వివిధ పార్టీల నాయకులు ముఠా జైసింహ, నాగేష్‌ముదిరాజ్ ఎండీ మోహిన్, శ్రీధర్‌రెడ్డి, పూస రాజు, శివాజీ

భక్తులతో పోటెత్తిన వైష్ణవాలయాలు


న్యూ రామాలయంలో కృష్ణ మందిరం వద్ద విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

నల్లకుంట: ధనుర్మాసం చివరి రోజైన మంగళవారం వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి సరస్వతి ఆలయంలో ఉదయం సీతారాములు, రంగనాథస్వామి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ధనుర్మాసం చివరి రోజు, సంక్రాంతి పర్వదినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

బాబా ఆలయం వద్ద అన్నదానం..

బాగ్ అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ద్వార పాలకుడు ఆంజనేయస్వామికి ఆకు పూజ, వడమాల పూజ, సాయిబాబాకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఉదయం, మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు.


సాయిబాబా మందిరం వద్ద అన్నదానం

మణిశాస్త్రికి 'మధురగాన తేజోద్విమణి' పురస్కారం


మణిశాస్త్రికి పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖ సాహితీ వేత్త వెంకట్ గరిగపాటి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాయిని సైతం కరిగించే.. మనిషి రోగాన్ని సైతం నయం చేసే కళ సంగీతానికి ఉందని ప్రముఖ సాహితీ వేత్త, ఎస్‌బీఐ జీఎం వెంకట్ గరిగపాటి అన్నారు. అంతటి విలువ ఉన్న సంగీతాన్ని ఆస్వాదించే అతి కొద్ది మంది గాయకులలో మణిశాస్త్రి ఒకరని అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సినీనటి జయప్రద 50 సంవత్సరాల సినీ ప్రస్థానం సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యంలో సంగీతానికి ఆకర్షితులైన ఎంతో మందికి మణిశాస్త్రి సంగీతం నేర్పించడం అభినందనీయమని అన్నారు.

- లిటిల్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు రామాచారి మాట్లాడుతూ... కళా సంస్థలు లేకపోతే పాటకు విలువ తగ్గుతుందన్నారు. కళా సంస్థల వల్లనే కళాకారులు ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన మణిశాస్త్రికి మధురగాన తేజోద్విమణి అనే బిరుదును అంకితం చేశారు. ఈ కార్యక్రమ సమర్పకురాలు మణిశాస్త్రి మాట్లాడుతూ... అందానికి అసలైన చిరునామా జయప్రద అని అన్నారు. సాంఘీక చిత్రాలతో పాటు పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాలలో తనదైన నటనతో ప్రేక్షకులను మైమరిపించారని అన్నారు. శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ, నాదవినోద సంగీత అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీగాయత్రి, కేశవ్, రవళి, స్మృతి, మహతి, చెందన, పవన్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. మల్లన్న కల్యాణోత్సవం

పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు


పట్టువస్త్రాలు తీసుకొచ్చిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు, బీఆర్‌ఎస్ నాయకులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలోని ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి మల్లన్న కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సంప్రదాయ పద్ధతిలో తీసుకువచ్చి సమర్పించారు. బీఆర్‌ఎస్ నగర నాయకుడు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రావు, నాగేష్‌ముదిరాజ్ కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు బోనం తీసుకొచ్చి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పంచామృతాభిషేకాలు, అగ్నిగుండాల వెలిగింపు, అగ్ని గుండాల ప్రవేశం, గొలుసులు తెంపుట తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత బింగి నవీన్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రజనీకాంత్‌గౌడ్, ముప్పిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: బాకారం మల్లికార్జునస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగతెప్ప పూజలో వివేకానందనగర్ నల్లపోచమ్మ దేవాలయం కమిటీ సభ్యులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒగ్గు పూజారులు, అతిథులుగా హాజరైన ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు శివాజీని ఆలయ నిర్వాహకులు సన్మానించారు.


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు


మల్లన్న దేవాలయంలో గొలుసులు తెంపుట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి


పూజలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నగర నేత నాగేష్‌ముదిరాజ్ తదితరులు


మల్లన్న స్వామికి బోనాలు, పట్టు వస్త్రాలు తీసుకొచ్చిన్న భక్తులు


పూస రాజు, శివాజీని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి, పూజారులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383